
మద్దతు తెలుపుతున్నారు.

మీడియావాళ్లు వచ్చి వార్తలు కవర్ చేస్తున్నారు. దీంతో ఈ వార్త తెలుగు రాష్ట్రాల్లోనే కాదు.. జాతీయస్థాయిలోనూ హాట్‌టాపిక్‌గా మారింది.

తమకు జరిగిన అన్యాయం గురించి మీడియాలో గొంతెత్తాడు ఖలీల్. పరదాల మాటున సాంప్రదాయిక రాక్షసత్వాన్ని దాచి.. అమ్మతోనే శాశ్వతంగా భూస్థాపితం చెయ్యొద్దని, ఏదైతే అమ్మ సమాధిపై ప్రతిన బూని వచ్చాడో.. దాన్ని ఇవాళ బహిర్గతం చేస్తున్నాడు.

''మా నాన్న పేరు ఖయ్యూం. అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్‌ల ఏడీఏ. నల్గొండ నుంచి రెండువందల కిలోమీటర్ల దూరంల ఉన్న మా గోపాల్‌పేట్ ఫారంలకు నాన్నకు తబాద్ల అయింది. ఆ ఫారంలకు కూలీ పనులకు పోయే అందమైన మా అమ్మను జూశి మనసువడ్డడు. ఇద్దరూ ప్రేమించుకున్నరు. కొన్నిరోజులకు పెద్ద మన్సులను ఒప్పిచ్చి నిఖా జేసుకున్నడు. నాలుగేండ్లల్లనే నేను, మా తమ్ముడు పుట్టేసినం.



నాన్నకు ఆల్రెడీ పెండ్లి అయి.. మాకన్నా పెద్దగ ముగ్గురు కొడుకులు, ఒక బిడ్డె ఉందన్న విషయం అమ్మకు తెల్సి శానా బాధవడ్డదట. మా పెద్దమ్మ గూడ భర్తను రెండో స్త్రీతోని పంచుకునుడును అస్సలు యాక్సెప్ట్ చెయ్యలేదు. పల్లెటూర్ల పుట్టిపెరిగిన అమ్మకు సంప్రదాయాలు, ఆచారాలు అంత గనం తెల్వాయి. పెద్దమ్మకు అన్నీ తెల్సు. 'గోషాపర్దా, నమాజ్, జికర్ లేదు. థూ! ఏం ఆడిదమ్మ' అని తిట్టేది. చిన్నప్పటిసంది అమ్మకేమో.. 'కష్టవడితే గానీ కడుపులకు రాదు! తప్పు జేస్తే అల్లా మాఫ్ చెయ్యడు' అనే తెల్సు. శుక్రవారం తానం జేసి గా ఒక్క నమాజ్ సదువుడు, ఏవో కొన్ని సూరాలు.. గంతే తెల్సు. గా తెల్వనితనమే వాళ్లకు ఆయుధమైంది. మా మర్మన్న అన్నలు గూడ అమ్మను అసహ్యించుకునేటోళ్లు. సంప్రదాయాలకు మేము బ్రాండ్ అంబాసిడర్లం అన్నంత బిల్డప్ ఇచ్చేటోళ్లు.

అట్లుండంగ.. అకస్మాత్తుగా ఒక రోజు నాన్న గుండెనొప్పితోని సచ్చిపోయిండు. సీతారాముల వనవాసం 14 ఏండ్లయితే.. అమ్మానాన్నల సహవాసం ఏడేండ్లే! అటెన్క అమ్మకు బతుకంతా వనవాసమే చేసిర్రు వాళ్లు!

ప్రకృతి ఒడిల పుట్టిపెరిగిన అమ్మకు నాన్న పోయినంక సంప్రదాయాల కట్టడైన ఆ ఇంట్ల అస్సలు ఉండబుద్ధికాలేదు.

'ఊరికి పోతా!' అన్నది.

'ఈడినుంచి వోయి ఎవనితోనో పోతవ్.. పోరగాండ్లను ఆగం జేస్తవ్. సప్పుడుదాంక ఈడనే ఉండు'.. పెద్దమ్మ మాట అమ్మ మనసును ఎల్లబొంగును ఒక్కపెట్టున కమ్మకత్తితోని చీల్చినట్టయ్యింది.

కట్టుబొట్టు, తనకొచ్చే పల్లెయాస నుంచి.. ఇట్ల ప్రతీ విషయంల వాళ్లు తనకు ఆంక్షలు పెట్టుడు, ఎక్కిరిచ్చుడు, కొత్తగా ఏదో నేర్పుడు.. 'సువ్వర్‌దానా!' అనుడు, పనిమనిషిలాగ ట్రీట్ చేసుడుతోని.. 'పుల్సీరాత్ కా రాస్తా!' అంటే ఇదేనేమో అన్న ఫీలింగ్ వచ్చిందక్కడ. ఊపిరి ఆడకుంటైంది.

ఒకరోజు లారీడ్రైవర్ అయిన మా మామ వాళ్లకు మంచిగనే సంజాంచినా.. 'రౌడీ లెక్కున్నడు' అన్నరు.

వేషభాషలను సూశి మన్సులను డిసైడ్ చేసేటంత పైస, ఆచార సంప్రదాయాలకు తామే సొక్కమైన వారసులం అనుకునే అహంకారం.. పైపెచ్చు పెద్ద సదువులు సదువుకున్నం అనే పొగరు వాళ్ల నరనరాన ఇంకిపోయింది.

అక్కడ మనలేనఓని కచ్చితంగా అనుకొని మమ్మల్ని తీసుకొని అమ్మ పుట్టింటికే వచ్చేసింది. ఏ సుట్టపక్కాలు గూడా ఏం జెయ్యలేకపోయిర్రు.

మల్ల అమ్మ కూలీ అవతారమెత్తి మమ్మల్ని పోషించింది. తమ్ముడు టీచర్ జాబ్ జేస్తున్నడు. నేను టైలర్. నాన్నకు రెండో భార్య అయిన అమ్మకు ఆస్తిల సగం వాటా న్యాయంగా రావాలి గదా? ఇయ్యుమని అడుగుతే ఇయ్యమన్నరు. నాన్న చేసిన ఉద్యోగాన్ని కూడా పెద్దమ్మనే మల్పుకొని పెన్షన్‌ల గూడా పాలు ఇయ్యలేదు.

దీంతోని అమ్మ కోర్టుల కేసేసి రెండుమూడేండ్లు కోర్టుల సుట్టు తిరిగింది. తనకు అంత స్తోమత లేదు, ఏం తెల్వది. లాస్టుకు.. 'డెబ్బై వేలిస్తం కేసు ఎన్కకు తీస్కో!' అన్నరు. అమ్మీ ససేమిరా అన్నది. దీంతోని హైకోర్టుల లాయర్‌గ జేస్తున్న పెద్దమ్మ వాళ్ల అన్నతోని గల్సి.. శానా అన్యాయంగా కేసును నీరుగార్చింది. చట్టం దృష్టిల ఫలానా ఖయ్యూం సాబ్‌కు ఒకతే భార్య, ఆ నలుగురు పిల్లలే ఉన్నరు. రెండో భార్య లేదు, మేము లేమని కోర్టు ద్వారా తీర్పు ఇప్పిచ్చి.. మా అస్తిత్వాన్ని బొందవెట్టి, కేసును క్లోజ్ చేపిచ్చిర్రు.

ఆ తీర్పుతోని అమ్మ సగం సచ్చిపోయింది. మనసు మొరంగడ్డ అయిపోయింది.

'మనసులతోని ముడిపడ్డ మా బంధాన్ని ఈ కాగితాలు, కత్వలు ఎట్ల ఏరు జేస్తయి?' అన్న ప్రశ్న అమ్మను లైఫ్‌లాంగ్ ఏడిపిచ్చింది.

తను ఎవరి భార్య? మేము ఎవరి పిల్లలం? అనే ప్రశ్న మా ఎదుగుదలల పొడసూపింది. మా భవిష్యత్తు మీద బండమోపింది.

షరియా చట్టాలన్నా న్యాయం చేస్తయేమో అంటే.. అవి గూడా మమ్మల్ని అక్కడికే రావాలన్నయి.

'వో బాజారీ ఔరత్‌కో హమ్ దీన్ సిఖాకే సుధారీంగే' అని అత్యంత కర్కశంగా మాట్లాడిర్రు.

అమ్మకు ఆ బంగారు పంజరంలకు పోవాలని లేదు. షరియా చట్టాలు గూడా సంప్రదాయం ముసుగేసుకొని స్త్రీని అణగదొక్కే పురుషాహంకారాన్ని ఇంకిచ్చుకున్నయని అమ్మకు సమజైంది.

'ఈ జన్మకింతే, వాళ్లతోని గెల్వలేం' అనుకొని మా ఎదుగుదలను, నాన్న ఫొటోను చూసుకుంట అమ్మ ఆ గాయాన్ని మెల్లగ మర్చిపోవట్టింది.

కానీ, తాను సచ్చిపోయినంక నాన్న పక్కకు బొందవెట్టాల్నని, గదే తన చివరి కోరికని అన్నది నాతోని. తమ ప్రేమబంధాన్ని మట్టిలోనైనా శాశ్వతం చేసుకుందామని అనుకున్నది.

బాధే జీవితంలా గడిపి వృద్ధాప్యంల అమ్మ సచ్చిపోయినప్పుడు నల్గొండల ఉన్న కనీస్ అన్నకు ఫోన్ జేస్తే నిర్దాక్షిణంగా ఫోన్‌కట్ చేసిండు.

అట్ల అమ్మ అటు చట్టం దృష్టిల ఖయ్యూంసాబ్ భార్య కాకుంట, ఇటు భర్త పక్కన సమాధి కాకుంటనే.. అస్తిత్వం కోల్పోయి ఆ అల్లా తానికి పోయింది. మరి

**'నమస్తే తెలంగాణ, ముల్కనూరు సాహితీపీఠం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2023/24'లో విశిష్ట బహుమతి పొందిన కథ.**